క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ కార్యకర్తకు దేవన్‌రెడ్డి పరామర్శ



శంకర్‌రెడ్డిని పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ గాజువాక సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి

అక్కిరెడ్డిపాలెం: కొద్ది రోజులుగా అనారోగ్య సమస్యతో బాధ పడుతున్న 69వ వార్డు వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు చాట్ల శంకర్ రెడ్డిని శుక్రవారం వైఎస్సార్‌సీపీ గాజువాక సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి ఆ పార్టీ నాయకులతో కలిసి పరామర్శించారు. శంకర్ రెడ్డితో మాట్లాడి సమస్య తెలుసుకున్నారు. అండగా ఉంటామని మనో ధైర్యాన్ని కల్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ 87వ వార్డు అధ్యక్షుడు బొడ్డ గోవింద్, కాకి అప్పలరెడ్డి, అంగ బాబూరావు, గొండేశి రామిరెడ్డి పాల్గొన్నారు.

కళా రంగంలో సేవలకు గుర్తింపు



నరసింహనాయుడు

అగనంపూడి: తెలుగు వెలుగు సాహితీ వేదిక జాతీయ స్వచ్ఛంద సేవా సంస్థ స్వామి వివేకానంద జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని కళారంగంలో విశేష సేవలు అందిస్తున్న కళాకారులకు నంది అవార్డులు ప్రదానం చేయనుంకీ మేరకు తనను కూడా అవార్డుకు ఎంపిక చేసిందని అగనంపూడి నిర్వాసితకాలనీ పెదమడకకు చెందిన కళాకారుడు విందుల నరసింహనాయుడును తెలిపారు. ఈనెల 2వ తేదీన విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించనున్న కార్యక్రమంలో నంది అవార్డు అందుకోనున్నట్టు చెప్పారు.

ఒకే రోజు రూ.50 లక్షల పన్ను వసూలు



జెడ్సీ శేషాద్రికి చెక్కు అందజేస్తున్న ఆర్వో రామనారాయణ

గాజువాక: జీవీఎంసీ గాజువాక జోన్ రెవెన్యూ విభాగ ఉద్యోగులు ఆస్తి పన్ను వసూలులో ప్రతిభ చూపారు. శుక్రవారం ఒక్కరోజే రూ.50 లక్షల పన్నులు వసూలు చేశారు. ఈ మొత్తానికి సంబంధించిన చెక్కులను రెవెన్యూ అధికారి సీహెచ్.రామనారాయణ, ఆర్ఐ రెడ్డి మోహన్ గాజువాక జోనల్ కమిషనర్ శేషాద్రికి అందజేశారు.

ఆరోగ్యంగా ఉంటేనే రాణింపు

అగనంపూడి: సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్న విద్యార్థి ఎంచుకున్న రంగంలో రాణించే అవకాశం ఉంటుందని రాధికా మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి అధినేత డాక్టర్ కె.రాధిక అన్నారు. దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలో ఆరోగ్యం–పరిశుభ్రతపై శుక్రవారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. విద్యార్థులు ఆరోగ్యంగా ఉండేందుకు తీసుకోవాల్సిన ఆహారం, ఆహార నియమాలు, పాటించాల్సి పద్ధతులను వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ జె.సుధాకర్, రెక్టార్ వి.మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

జీపీసీ నిల్వలు తరలించాలని వినతి

అక్కిరెడ్డిపాలెం: మింది నుంచి షీలానగర్ టోల్‌గేటు వైపు వెళ్లే పోర్టు రోడ్డులో ఓ ప్రైవేట్ కంపెనీ గొడౌన్లను నిర్మించి అందులో నిల్వ ఉంచిన గ్రీన్ పెట్రో కోక్ (జీపీసీ)ను వెంటనే తొలగించాలని కోరుతూ పంచవటీ హౌస్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (పోవా) ప్రతినిధులు, పలు పార్టీల నాయకులు శుక్రవారం ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. పోవా గౌరవ అధ్యక్షుడు పి.చిన్నారావు మాట్లాడుతూ పోర్టు అథారిటీకు చెందిన ఒక ప్రైవేట్ కంపెనీ ప్రధాన డ్రైన్లను మూసివేసి దానిపై గొడౌన్లు నిర్మించి జీపీసీ నిల్వ చేస్తుందని వివరించారు. రసాయనాలతో కూడిన ఈ నిల్వల వల్ల గొడౌన్‌లను ఆనుకొని ఉన్న పంచవటీ, అక్కిరెడ్డిపాలెం, మింది, చుట్టు పక్కల గ్రామాలు కాలుష్యాకోరల్లో చిక్కుకుంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పోర్టు అథారిటీ అధికారులతో మాట్లాడి జీపీసీ నిల్వలు తరలించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేను కోరారు. కార్యక్రమంలో పోవా ఉపాధ్యక్షుడు ఎస్.పండా, కార్యదర్శి వై.రామ్మోహన్, కె.నారాయణరావు, వి.సత్యనారాయణ, జి.వి.సుబ్బరాజు, నాయకులు గుంటూరు మూర్తి, మురళి, సీహెచ్.విశ్వనాథ్ పాల్గొన్నారు.

రోడ్లే ఆధారం!

జనవాకను స్థల సమస్య వెంటాడుతోంది. పిల్లలు ఆడుకోవడానికి రోడ్లే మైదానం. వ్యాపారాల నిర్వహణకూ రహదారులే దిక్కు. వాహనాల పార్కింగ్‌కూ అవే ప్రత్యామ్నాయం. గాజువాకలో అన్నింటికీ రహదార్లే ఆధారం. మహానగరంలో అతిపెద్ద జోన్‌గా ఉన్న గాజువాకలో దుస్థితి ఇది.

– గాజువాక

- వ్యాపారాలు, పార్కింగ్, క్రీడల సాధనకు రహదారులే వేదిక
- మహా పట్టణానికి ఇదో వెలితి
- గాజువాకలో ఏళ్లుగా తీరని సమస్యలు
- అవస్థలు పడుతున్న ప్రజలు



ఫుట్‌పాత్‌లు ఆక్రమించిన వ్యాపారులు

గాజువాక జోన్ 20 వార్డులతో విస్తరించి ఉంది. జన సాంద్రత ఎక్కువ. అందుకు తగ్గట్టుగా క్రీడా మైదానాలు.. మార్కెట్‌లు, హాకర్‌జోన్స్ లేక పోవడంతో అన్నింటికీ రోడ్లే వేదికలు అవుతున్నాయి. ఫలితంగా నిత్యం ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈ పరిస్థితి చూస్తూ ఊరుకోవడం తప్పా అధికార యంత్రాంగం ప్రత్యామ్నాయాలపై దృష్టి సారించడం లేదు. ఒకవేళ ఎవరైనా స్పందించినా రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఫలితంగా అంతా అవస్థలు పడాల్సి వస్తోంది.

ఫుట్‌పాత్‌లపైనే వ్యాపారాలు

గాజువాక మెయిన్‌రోడ్డులోని ఫుట్‌పాత్‌లు వ్యాపారులకు ఉపయోగపడుతున్నాయి. పాదచారుల కోసం లక్షల రూపాయలు వెచ్చించి నిర్మించిన ఫుట్‌పాత్‌లు రెడీమేడ్ వ్యాపారులు, చెప్పుల దుకాణాలు, పండ్ల వ్యాపారులకు ఉపయోగపడుతున్నాయి. గతంలో ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు నిర్వహించుకొనే హాకర్లను ప్రత్యేక జోన్‌కు తరలించాలని ప్రతిపాదించారు. రాజకీయ అడ్డంకులు రావడంతో ఆ ప్రతిపాదన అటకెక్కింది. పెద్దపెద్ద షోరూమ్‌లు కూడా ఫుట్‌పాత్‌లను తమ వ్యాపారాల కోసం ఉపయోగించుకొంటున్నాయి. సరైన పార్కింగ్ ఏర్పాటు చేయకపోవడంతో కొనుగోలుదారులు తమ వాహనాలను రోడ్లపైనే నిలిపివేస్తున్నారు. ఫలితంగా గాజువాక ట్రాఫిక్ పద్మవ్యూహంగా మారుతోంది. ట్రాఫిక్ పోలీసులు మామూళ్లు దండుకోవడం తప్పా సమస్య పరిష్కారానికి ప్రయత్నించడం లేదని జనం గగ్గోలు పెడుతున్నారు.



సామాజిక భవనం ఆవరణలో సాధన చేస్తున్న విద్యార్థులు

ఆట స్థలాలు లేక అవస్థలు

దినదినాభివృద్ధి చెందుతున్న గాజువాకలో సరైన క్రీడా ప్రాంగణం లేదు. జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులున్న ఈ ప్రాంతానికి మైదానాలు లేని లోటు తీరని వేదన మిగుల్చుతోంది. దీంతో ఔత్సాహిక క్రీడాకారులు నడిరోడ్లపైనే సాధన చేసుకుంటున్నారు. గాజువాక మున్సిపాలిటీగా ఉన్నప్పుడు వినాయకనగర్‌లో మూడున్నరెకరాల స్థలంలో ఇందిరా ప్రియదర్శిని స్పోర్ట్స్ కాంప్లెక్స్ (క్రీడా సముదాయం) కోసం తొలుత 1991 ఏప్రిల్‌లో, ఆ తర్వాత 2005 నవంబర్‌లో శంకుస్థాపన చేశారు. అనంతరం నిధులు లేవని వుడా చేతులెత్తేసింది. ఏడాదికోసారి ఆ ప్రతిపాదనపై చర్చించడం, ఆ తర్వాత వదిలేయం ఆనవాయితీగా మారిపోయింది. క్రీడా ప్రాంగణాల ఏర్పాటు విషయంలో సరైన ప్రణాళిక లేకపోవడం క్రీడాకారులకు శాపంగా మారింది.



రోడ్లపైనే వాహనాల పార్కింగ్

రోడ్లపైనే వాహనాలు

ఇరుకురోడ్లతో నిత్యం రద్దీగా ఉన్న గాజువాకలో వాహనాల పార్కింగ్ సమస్యగా మారింది. భారీ వాహనాలను సైతం జనావాసాల మధ్య, రద్దీ రోడ్లపైనే నిలిపివేస్తున్నారు. ట్రక్ టెర్మినల్ లేకపోవడం వల్ల ట్యాంకర్లు, లారీలు, ట్రాలర్ల పార్కింగ్ ఇబ్బందిగా మారింది. రోడ్లపైనే వాహనాలు నిలిపివేస్తుండడంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకొంటున్నాయి. అనధికార పార్కింగ్ వద్దని ట్రాఫిక్ పోలీసులు చెప్పినా వినే పరిస్థితి లేదు. సరైన స్థలం లేదనే కారణంతో ట్రక్ టెర్మినల్ వ్యవహారం వెనక్కి పోవడంతో ఈ సమస్య జటిలమైంది.



శ్రీనగర్‌లో రోడ్డును మూసేసిన హెచ్‌టీ టవర్

విద్యుత్ స్తంభాలు, హెచ్‌టీ టవర్లదీ అదేదారి

రోడ్ల మధ్యలో దర్శనమిస్తున్న ఈ విద్యుత్ స్తంభాలను చూస్తే పరిస్థితి ఇట్టే అర్థమైపోతుంది. గాజువాక ప్రాంతంలో ప్రజా ప్రయోజన పనులను చేపట్టడానికి స్థలాల సమస్య ఏ స్థాయిలో ఉందో తెలిసిపోతుంది. పలు ప్రాంతాలకు విద్యుత్ సౌకర్యం కల్పించడానికి స్థలం లేక ఇలా రోడ్ల మధ్యలోనే స్తంభాలు ఏర్పాటు చేశారు. గాజువాకలో దాదాపు అన్ని వార్డుల్లో ఈ పరిస్థితి కనిపిస్తుంది. చిన్నచిన్న రోడ్ల మధ్యలో ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలు, హైటెన్షన్ విద్యుత్ వైర్ల కోసం ఏర్పాటు చేసిన టవర్లు దర్శనమిస్తాయి. ఈ పరిస్థితిని చూసి పెదవి విరవడం తప్పా మరేం చేయలేని దుస్థితిలో అటు అధికారులు, ఇటు ప్రజాప్రతినిధులు ఉన్నారు.

సంఘటితంగా ఉంటే పార్టీకి పూర్వ వైభవం



గాజువాక సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డిని సత్కరిస్తున్న వార్డు నాయకులు

అగనంపూడి: కార్యకర్తలు, నాయకులు భేషజాలకు పోకుండా సమష్టిగా పని చేద్దామని వైఎస్సార్‌సీపీ గాజువాక సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి అన్నారు. గాజువాక సమన్వయకర్తగా నియమితులైన దేవన్‌రెడ్డిని కణితిలో నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాన్ని ప్రజలకు అర్థం అయ్యేటట్టు చేస్తే చాలన్నారు. వైఎస్సార్‌సీపీ గాజువాక మండల అధ్యక్షుడు బొడ్డ గోవింద్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు ప్రగడ శ్రీనివాసరావు, బొడ్డ సన్యాసిరావు, ఎల్‌ఐసీ నాయుడు, పిన్నింటి సంతోష్, ప్రగడ శంకరరావు, గొనప సన్యాసినాయుడు, దుగ్గపు నరసింహమూర్తి, పిడుగుర్ల రెడ్డి, ఆడారి శ్రీను, దాకా సత్తిబాబు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ధ్వజస్తంభ ప్రతిష్టాపన ఉత్సవాలు



మహా మృత్యుంజయేశ్వరస్వామిని ఊరేగిస్తున్న దృశ్యం

పెదగంట్యాడ: జీవీఎంసీ 76వ వార్డు నడుపూరులోని సంకటమోచన గణపతి ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్టాపన, మహా మృత్యుంజయేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా మహా మృత్యుంజయేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను పురవీధుల్లో ఊరేగించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు మంత్రి నరసింహమూర్తి మాట్లాడుతూ ఈ నెల 2న ఆలయంలో ధ్వజ స్తంభ ప్రతిష్ట, మహా మృత్యుంజయేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ట ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి, ఎమిలీ జ్వాల దంపతులు, మంత్రి రాజశేఖర్, మంత్రి శంకర్‌నారాయణ, పల్లా చిన తల్లి, గంధం శ్రీనివాసరావు, తిప్పల వంశీరెడ్డి, ముమ్మన మురళి, మామిడి రంగనాథ్, రూప, అన్నెపు రవిచంద్ర, సాయి కీర్తి పాల్గొన్నారు.

ఘనంగా వాసవీ మాత ఆత్మార్పణ దినోత్సవం



కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

పెదగంట్యాడ: మండలంలోని హౌసింగ్ బోర్డు కాలనీ శివారులోని వాసవీ కన్యకా పరమేశ్వరి పంచాయతన ఆలయంలో వాసవీ మాత ఆత్మార్పణ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం 5 గంటలకు పంచామృతాభిషేకం, మండపారాధనలు చేశారు. అలాగే మహాగణపతి, లక్ష్మీ గణపతి, మహాలక్ష్మీ, వాసవీ మూలమంత్ర హోమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు కుంకుమార్చనలు చేశారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవమూర్తిని పురవీధుల్లో ఊరేగించారు. ఉత్సవ కమిటీ ప్రతినిధులు ముమ్మిడిశెట్టి ముత్యాలశెట్టి,కొల్లా అప్పలరాజు, మొగలపల్లి త్రిమూర్తులు, బొండాడ వెంకటేశ్వరరావు, చిట్టూరి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఏటా అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తూ వస్తున్నామని తెలిపారు. అమ్మవారిని వైఎస్సార్ సీపీ గాజువాక సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి, 74వ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి అలాగే పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో పెరుమాళ్ల వెంకటేశ్వర్లు, పచ్చికోళ్ల గోపి తదితరులు పాల్గొన్నారు.

సారె.. అదిరె



పూజలందుకున్న దుర్గా భవాని సారె ఊరేగిస్తున్న భక్తులు

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు పెదమడకలోని సూదికొండపై వెలసిన దుర్గా భవానీ అమ్మవారి ఆలయ 5వ వార్షికోత్సవం ఘనంగానిర్వహించారు. ఆలయ ధర్మకర్త బళ్ల పైడిరాజు ఆధ్వర్యంలో అమ్మవారికి విశేష పూజలు, అభిషేకాలు జరిపించారు. వందలాది మంది భక్తులు పాల్గొని అమ్మవారికి పసుపు, కుంకుమలతో పూజలు చేశారు. ముందుగా అమ్మవారి సారెను భక్తిశ్రద్ధలతో గ్రామంలో ఊరేగించి అమ్మవారికి సమర్పించారు.

కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి, ప్రసాద్, కరణం లక్ష్మి అప్పారావు, నక్కా రమణబాబు, వంకర రాము, కె.దశేంద్ర, టి.వెంకటరావు, బి.సత్యనారాయణ, ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు ఘనంగా వీడ్కోలు

ఉక్కునగరం: పదవీ విరమణ చేసిన స్టీల్ ప్లాంట్ ఉద్యోగులకు ఘనంగా వీడ్కోలు పలికారు. వివిధ విభాగాల్లో శుక్రవారం జరిగిన సత్కార కార్యక్రమాల్లో పదవీ విరమణ చేసిన ఉద్యోగుల దంపతులకు శాలువాలు కప్పి పూలమాలలతో అభినందించారు. స్పెషల్ బార్ మిల్ (ఎస్‌బీఎం) విభాగంలో జరిగిన కార్యక్రమంలో విభాగాధిపతి సంజయ్ కుమార్, సీనియర్ మేనేజర్ జి. మహేందర్‌రెడ్డి, జనరల్ ఫోర్‌మెన్ ఎ.ఎస్. రాజులను ఘనంగా సత్కరించారు. జూనియర్ ఉద్యోగులు వారిని ఆదర్శంగా తీసుకుని స్టీల్‌ప్లాంట్ పురోభివృద్ధికి సహకరించాలన్నారు. సన్మాన గ్రహీతలు మాట్లాడుతూ తమ ఎదుగుదలకు స్టీల్‌ప్లాంట్ ఎంతో దోహదపడిందన్నారు. కార్యక్రమంలో విభాగం అధికారులు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నెట్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక నేడు

అగనంపూడి: ఉమ్మడి విశాఖ జిల్లా నెట్‌బాల్ జూనియర్ జట్ల (బాలురు, బాలికలు) ఎంపిక శనివారం మధ్యాహ్నం రెండు గంటలకు కణితి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నట్టు విశాఖ జిల్లా నెట్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి వీరు మహంకాళి తెలిపారు. ఎంపికల్లో పాల్గొనదలచిన బాలురు, బాలికలకు ఈనెల 1వ తేదీకి 19 ఏళ్లు నిండాలని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు ఆధార్ కార్డు జెరాక్స్‌తోపాటు స్టడీ సర్టిఫికెట్‌తో హాజరు కావాలని తెలిపారు. ఎంపికైన జట్లు ఈనెల 8న రావులపాలెంలో జరుగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొడానికి అర్హులని చెప్పారు.

4న క్యాంపస్ ఇంటర్వ్యూలు

గాజువాక: డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్‌లో ఉద్యోగాల నియామకాలకు స్థానిక ఎంవీఆర్ డిగ్రీ కళాశాలలో ఈ నెల 4న ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు కళాశాల కరస్పాండెంట్ వి.రామారావు తెలిపారు. బీఎస్సీ, ఎమ్మెస్సీలలో కెమిస్ట్రీ సబ్జెక్టుగా 60 శాతం కనీస మార్కులతో ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరు కావచ్చని పేర్కొన్నారు. అభ్యర్థులు తమ బయోడేటా, సర్టిఫికెట్‌లు, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో హాజరు కావాలన్నారు.

వైభవంగా మరిడిమాంబ సిల్వర్‌జూబ్లీ ఉత్సవాలు



అమ్మవారికి పూజలు చేస్తున్న దేవన్‌రెడ్డి



అమ్మవారికి నూతన వస్త్రాలు సమర్పిస్తున్న కార్పొరేటర్ వరలక్ష్మి, ఆలయ కమిటీ ప్రతినిధులు

అగనంపూడి: అగనంపూడి నిర్వాసితకాలనీ పెదమడక గ్రామదేవత మరిడిమాంబ అమ్మవారి ఆలయం ఏర్పాటు చేసిన 25 వసంతాలు పూర్తయిన సందర్భంగా సిల్వర్ జూబ్లీ వార్షికోత్సవం వైభవంగా నిర్వహించారు. అమ్మవారి ఆలయానికి రంగులు అద్దారు. పూలు, విద్యుద్దీపాలతో ఆలయాన్ని ముస్తాబు చేశారు. అమ్మవారి సారెను నిర్వాసితకాలనీల్లో భారీ ఊరేగింపుగా తీసుకువెళ్లారు. ముఖ్య అతిథిగా హాజరైన వైఎస్సార్‌సీపీ గాజువాక సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి అమ్మవారికి అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం విశేష అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ శాంతిభద్రతల సీఐ కేశవరావు, దువ్వాడ ట్రాఫిక్ సీఐ కర్రి వెంకటరావు, 85వ వార్డు కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి, ప్రసాద్, అనకాపల్లి జిల్లా జనసేన ప్రధాన కార్యదర్శి విందుల వెంకటరమణ, నాయకులు కర్రి దశేంద్ర, ఆలయ, ఉత్సవ కమిటీల ప్రతినిధులు పాల్గొన్నారు.

చిత్తడి నేలలపై అవగాహన అవసరం

విద్యార్థులకు డ్రాయింగ్, వ్యాసరచన పోటీలు

అగనంపూడి: అనకాపల్లి జిల్లా విద్యాశాఖాధికారి గిడ్డి అప్పారావు నాయుడు ఆదేశాల మేరకు ఈనెల 2న అంతర్జాతీయ చిత్తడి నేలల దినోత్సవాన్ని ప్రతీ పాఠశాల పరిధిలో నిర్వహించాలని ఏపీఎన్‌జీసీ జిల్లా కోఆర్డినేటర్ శిష్టు ఖగేశ్వరరావు అన్నారు. లంకెలపాలెంలో నిర్వహించిన కార్యక్రమంలోఆయన మాట్లాడుతూ జిల్లాలోని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, గ్రీన్ టీచర్లు, ప్రిన్సిపాళ్లు చిత్తడి నేలల దినోత్సవాన్ని పురస్కరించుకొని గ్రామస్థాయిలో చిత్తడి నేలలపై అవగాహన ర్యాలీ, పాఠశాల స్థాయిలో చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించి ఏపీఎన్‌జీసీ వాట్సాప్ గ్రూపులో పోస్ట్ చేయాలని కోరారు. ఫొటోలు జీపీఎస్‌యాప్‌లో తీయాలని సూచించారు. ఫొటోలు, పోస్టులు పరిశీలించి, విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందిస్తామని చెప్పారు. వివరాల కోసం 9440730437 నంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

ప్రమాదకరంగా గొయ్యి



షీలానగర్ పెట్రోల్ బంక్ ఎదురుగా సర్వీసు రోడ్డుపై ప్రమాదకరంగా గొయ్యి

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ పెట్రోల్ బంక్ ఎదురుగా ఉన్న భారీ గొయ్యి ప్రమాదాలకు కారణమవుతోంది. నిత్యం వేలాది మంది వాహనచోదకులు పెట్రోల్ కోసం పెట్రోల్ బంక్‌కు విచ్చేస్తున్నా బంక్ యాజమాన్యం కనీసం పట్టించుకోకపోవడం శోచనీయమని వాహనచోదకులు వాపోతున్నారు. కాగా పెట్రోల్ బంకు యాజమాన్యం మాత్రం గుండ సర్వీసె రోడ్డుపై ఉందని.. జీవీఎంసీ అధికారులు పూడ్చాలని చెబుతోంది. ఇప్పటికే సమస్యపై అధికారులకు ఫిర్యాదు చేశామంటున్నారు. ఏది ఏమైనా వాహనచోదకులు రాత్రి వేళ గుంతను గుర్తించ లేక ప్రమాదాల బారిన పడుతున్నారు. తక్షణమే స్పందించి పూడ్చాలని కోరుతున్నారు.

ఇలా కూడా స్పందిస్తారా!

- గోతులు తవ్వేసి వదిలేశారు
- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న నీటిసరఫరా విభాగం
- రాత్రి వేళ గోతిలో పడితే ఎవరిది బాధ్యత?



పైప్‌లైన్ లీకేజీతో వృథాగా పారుతున్న నీరు (ఇన్‌సెట్) తవ్వి వదిలేసిన గొయ్యి

అగనంపూడి: జీవీఎంసీ 87వ వార్డు లక్ష్మీపురం కాలనీలో పైప్‌లైన్ పగలడంతో నీరు లీకై వృథాగా పారుతున్న విషయాన్ని పదిరోజుల కిందట ' సాక్షి' ప్రచురించింది. మరుసటి రేజే లీకేజీ ఉన్న చోట పైప్‌లైన్ చుట్టూ పెద్ద గొయ్యితవ్వి వదిలేశారు. ఇదే విషయమై స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేస్తే సిబ్బందిని వార్డుకు కేటాయిస్తున్నామని, పది రోజుల నుంచి మరమ్మతులు చేపట్టపోవడం ఏంటని అధికారులు తిరిగి ప్రశ్నిస్తున్నారు తప్పా సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నీటిని సరఫరా చేసే సమయంలో నీరు వృథాగా పారుతుందని కాలనీవాసులు వాపోతున్నారు. పైప్‌లైన్ మరమ్మతులు చేపట్టి గోతులు పూడ్చకపోతే రాత్రి వేళ గోతిలో ఎవరైనా పడిపోతే బాధ్యత ఎవరు వహిస్తారని నిలదీస్తున్నారు. తక్షణం ఉన్నతాధికారులు స్పందించి అలక్ష్యం వహిస్తున్న సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.